01ATP05_01ATP05.qxd 05-08-2026 PM 10:43 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

గురువారం 06 ఆగస్టు 2026 పేజీలు : 04

అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ రైల్వే సమస్యలను పరిష్కరించండి

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న అంబికా లక్ష్మినారాయణ

అనంతపురం, ఆగస్టు 5 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న రైల్వే సమస్యల పరిష్కారం, ప్రయాణికులకు మెరుగైన రైల్వే సౌకర్యాల కల్పన, రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి, కొత్త రైళ్ల మంజూరు, రైళ్ల నిలుపుదలలు, రైల్వే హాల్ట్‌లు, అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్ల నిర్మాణం తదితర అంశాలపై అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మినారాయణ కోరారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలోని పరిస్థితులను తెలియజేస్తూ.. అదే విధంగా గుంతకల్లు బళ్లారి మధ్యలో మూడు, నాలుగు

- కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరిన ఎంపీ అంబికా లక్ష్మినారాయణ

వరుసల ట్రాక్ నిర్మాణానికి 3500 కోట్లు నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కి, రైల్వే శాఖ సహాయ మంత్రి సోమణ్ణకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా ప్రజలు చాలా కాలంగా ఎదురుచూస్తున్న పలు రైల్వే సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఎంపీ, అనంతపురము, కల్లూరు, గుత్తి, రాయలచెరువు మరియు రాయదుర్గం స్టేషన్‌లలో పలు రైళ్ల నిలుపుదల, కొత్త రైలు సర్వీసుల ప్రారంభం, రైళ్ల సమయాల సవరణ,

>> 3

రీసర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి

- సిరివరంలో జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ పర్యటన - స్వర్ణ గ్రామ సచివాలయం తనిఖీ

- ఈ పంట నమోదు, రీసర్వే క్షేత్రస్థాయి పరిశీలన

లీ సర్వే వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

లేపాక్షి, ఆగస్టు 5 ప్రభాతవార్త

రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. మండలంలోని సిరివరం రెవెన్యూ గ్రామంలో బుధవారం జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించి, అభివృద్ధి కార్యక్రమాలు, రెవెన్యూ ప్రాజెక్టుల పురోగతిని తనిఖీ చేశారు.

గ్రౌండ్ ట్రూథింగ్, ఈకేవైసీ తనిఖీ :

గ్రామంలోని సర్వే నెంబర్ 222లోని 11.29 ఎకరాల పట్టా భూమిలో జరుగుతున్న రీసర్వే "గ్రౌండ్ ట్రూథింగ్" ప్రక్రియను కలెక్టర్ శ్యాంప్రసాద్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఈకేవైసీ ప్రక్రియ తీరును అడిగి తెలుసుకున్నారు. రీసర్వే విశేషాలు, ఈకేవైసీ ప్రాముఖ్యతపై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని సర్వే సిబ్బందిని ఆదేశించారు.

ఈపంట నమోదు పరిశీలన :

అదేవిధంగా సర్వే నెంబర్ పరిధిలో రైతు వినోద్ సాగు చేసిన మొక్కజొన్న పంటను కలెక్టర్ పరిశీలించారు. మొబైల్ యాప్ ద్వారా నిర్వహిస్తున్న ఈ పంట నమోదు విధానాన్ని స్వయంగా తనిఖీ చేశారు. ప్రతి రైతు సాగు చేసిన పంటను తప్పనిసరిగా డిజిటల్

ఈ పంట నమోదు పరిశీలిస్తున్న కలెక్టర్

పద్ధతిలో నమోదు చేయించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మద్దతు ధర పొందడానికి ఈపంట నమోదు ఎంతో కీలకమని పేర్కొన్నారు.

సచివాలయ పనితీరుపై సమీక్ష :

సిరివరంలోని స్వర్ణ గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్లు, ఇతర రికార్డులను పరిశీలించి వారి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయ పరిధిలో జరుగుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పనుల పురోగతిపై వివరాలు సేకరించారు. ప్రజలకు సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని, ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ సకాలంలో అందేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని సిబ్బందికి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ వెంట లేపాక్షి తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, స్థానిక రెవెన్యూ, వ్యవసాయ, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్వోబీ నిర్మాణంలో అంతులేని నిర్లక్ష్యం

- పై వంతెన లేక ప్రజలకు తప్పని ప్రయాస - ప్రతి'సారీ' ప్రతిపాదనలకే పరిమితం

గేటు వద్ద తరచూ ఎక్కడి వాహనాలు అక్కడే ఆగాల్సిందే..

యాడికి(తాడిపత్రి), ఆగస్టు5, ప్రభాతవార్త

ప్రజావసరాలు, ప్రజల సమస్యల పరిష్కారమే పరమావధిగా అధికారులు పని చేయకుంటే ప్రజలకు ఇబ్బందులు తప్పవు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా యాడికి రైల్వే గేటు వద్ద యాడికి-రాయలచెరువు మధ్య రైలు మార్గంపై నిర్మించాల్సిన రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) నిలుస్తోంది. అధికారులు వేగంగా పనిచేసి సకాలంలో నిర్ణయాలు తీసుకుంటే ఇప్పటికే నిర్మాణం పూర్తయ్యేది. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏళ్ల తరబడి ఏ విధమైన పురోగతి లేదు. దీంతో నిత్యం వేలాది మంది ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకొని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఆర్వోబీ నిర్మాణంలో అంతులేని నిర్లక్ష్యంతో ప్రతిసారీ ప్రతి పాదనలకే పరిమితం కావాల్సి వస్తోంది. అధికారులు భూసేకరణలోనే మీనమేషాలు లెక్కిస్తూ ప్రజలను ప్రయాసలకు గురి చేస్తున్నారు.

ఃపై వంతెన లేక ప్రజలకు తప్పని ప్రయాస

యాడికి-రాయలచెరువు, రాయలచెరువు-చందన మార్గంలోని రైల్వేగేట్లు తరచూ పడుతుండటంతో ఈ దారుల్లో వెళ్లే ప్రజల ప్రయాణం నరకప్రాయంగా మారింది. గేటు పడితేచాలు మూడు లేదా నాలుగు రైళ్లు వెళ్లే వరకు ఆగాల్సిందే. దీంతో మండల కేంద్రమైన యాడికికి వెళ్లాల్సిన రాయల చెరువు, కూర్మాజిపేట, రామరాజుపల్లి, తూట్రాళ్లపల్లి, కొత్తపల్లి, నగరూరు, బోగాలకట్ట, పుప్పాల వెంగన్నపల్లి ప్రజలతో పాటు డోన్‌కు దగ్గర దారిగా భావించి రాయలచెరువు నుంచి వెళ్లే వేలకొద్ది జనానికి ఈ రైల్వేగేట్లు తీవ్ర అడ్డంకిగా మరాయి. ఈ రైల్వే గేట్ల వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మించడానికి రైల్వే అధికారులు నిర్ణయించారు. ఈ ఆర్వోబీ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి కూడా ఆమోదం లభించింది. 2027 నాటికి దేశంలోని అన్ని రైల్వేగేట్ల స్థానంలో వంతెనల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. దీనికి సంబంధించి గతేడాది జనవరి నుంచి అధికారుల బృందం పలు దఫాలుగా రైల్వే గేట్లున్న ప్రాంతాలను పరిశీలించారు. రైళ్ల రద్దీ, స్థానిక పరిస్థితులు, ట్రాఫిక్ సమస్య, స్థల లభ్యతలను దృష్టిలో పెట్టుకొని ఎక్కడెక్కడ ఆర్వోబీ(పై వంతెన), ఆర్‌యూబీ(దిగువ వంతెన)లు నిర్మించాలో స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులతో చర్చించి ఒక నిర్ణయానికి వచ్చి

>> 2

గేటు పడటంతో ప్రయాణికుల సహనానికి తప్పని పరీక్ష

కేంద్ర గ్రామీణ అభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసానిని కలిసిన ఎంపీ బికె పార్థసారథి

- పుట్టపర్తిలో గ్రామీణ స్వయంఉపాధి శిక్షణసంస్థ భవనానికి నిధులు కోరిన ఎంపీ..

పెనుకొండ ఆగస్టు 5 ప్రభాతవార్త

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని కలిసిన ఎంపీ బికే పార్థసారథి

ఢిల్లీలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను బుధవారం హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హిందూపురం ఎంపీ బికే పార్థసారథి కేంద్ర గ్రామీణ అభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని నీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో గ్రామీణ అభివృద్ధి శిక్షణ సంస్థ నూతన భవన నిర్మాణానికి రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరినట్లు ఎంపీ బీకే పార్థసారథి ఓ ప్రకటనలో తెలిపారు. అందుకు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని సానుకూలంగా స్పందించి తప్పకుండా మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆ ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ఢిల్లీలోని పార్లమెంట్ భవన్ లో సహచర పార్లమెంటు సభ్యులతో కలిసి ఎంపీ బీకే పార్థసారథి కేంద్ర గృహ నిర్మాణ మరియు పట్టణ వ్యవహారాల మంత్రి మనోహర్ లాల్ కట్టర్ ను కలిసి అమరావతి పై రచించిన పుస్తకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, తదితర ఎంపీలు పాల్గొన్నారు.

విద్యార్థినులతో మసాజ్ చేయించుకున్న ఘటనలో

ఇద్దరు సస్పెండ్

- నంబులపూలకుంట కేజీబీవీ టీచర్, ప్రిన్సిపల్‌పై వేటు

విద్యార్థులతో మసాజ్ చేయించుకుంటున్న టీచర్ రూపారాణి

అనంతపురం క్రైమ్ ఆగస్టు 5 ప్రభాతవార్త

విద్యార్థులకు బాధ్యతగా విద్యా బుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులు సర్వసభ్య సమాజం తల దించుకునేలా వ్యవహరిస్తున్నారు. వారికి విద్యాభ్యాసం చేయించి ఉజ్వల భవిష్యత్ కు బంగారు బాట వేయాల్సిన టీచర్లు బాధ్యతా రాహిత్యంగా తమ సొంత పనులకు వాడుకోవడం వివాదాస్పదంగా మారింది. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో వైరలైంది. దీంతో విద్యాశాఖ అధికారులు ఈ ఘటనపై సీరియస్‌గా పరిగణించి పూర్తిస్థాయిలో విచారణ చేయించారు. విచారణలో వాస్తవాలు వెలికి తీయడంతో బాధ్యులైన ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారు.. వివరాల్లోకి వెళితే...

శ్రీసత్యసాయి జిల్లాలోని నంబులపూలకుంట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులతో మసాజ్ చేయించుకున్న ఘటన తీవ్ర కలకలం రేపిన నేపథ్యంలో బాధ్యులైన హిందీ టీచర్ రూపారాణి, విధుల్లో నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపల్ రెహనాలను ఉద్యోగం నుంచి తొలగిస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నంబులపూలకుంట కేజీబీవీ పాఠశాలలో హిందీ టీచర్‌గా పని చేస్తున్న ..

>> 2..

ఇండియా స్కిల్స్ కాంపిటీషన్ 2026ను యువత సద్వినియోగం చేసుకోవాలి

శ్రీ సత్య సాయి జిల్లా, ఆగస్టు 5, ప్రభాతవార్త ప్రతినిధి

యువతలోని వృత్తి నైపుణ్యాలను వెలికితీసేందుకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇండియా స్కిల్స్ 2026 పోటీలకు రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని, యువతీ యువకులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ కోరారు. దేశంలోని యువతలో దాగి ఉన్న అసాధారణ ప్రతిభను జాతీయ వేదికపై ప్రదర్శించడానికి ఇది అతిపెద్ద వేదిక అని,వివిధ రంగాల్లో ప్రావీణ్యం ఉన్న అభ్యర్థులు తమ ప్రతిభను నిరూపించుకోవడానికి ఇది ఒక అద్భుతమైన అవకాశం అన్నారు.ఈ పోటీలో విజేతలకు నగదు బహుమతులతో పాటు, ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ నిపుణులచే ప్రత్యేక శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. జాతీయ స్థాయిలో సత్తా చాటిన విజేతలు అంతర్జాతీయ వేదికపై జరిగే ఖివరల్డ్ స్కిల్స్ఖి పోటీలలో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించే అరుదైన అవకాశాన్ని పొందుతారన్నారు. జిల్లా / జోనల్ (శ్రీ సత్యసాయి జిల్లా) రాష్ట్రస్థాయి (విజయవాడ) రీజినల్ జాతీయస్థాయి (ఢిల్లీ) అంతర్జాతీయ స్థాయికి ఎంపికలు ఉంటాయన్నారు. ఐటిఐ, డిప్లమా, డిగ్రీ, బీటెక్, మరియు ఇతర సాంప్రదాయ కోర్సులు పూర్తి చేసిన వారు, మరియు చదువుకున్న వారు రిజిస్ట్రేషన్ లింక్ www.nsdc.in/ఇండియస్కిల్ లో నమోదు చేసుకోవాలని కోరారు. 01 జనవరి 2003 తర్వాత జన్మించిన వారు సైబర్ సెక్యూరిటీ, ఇండస్ట్రీ 4.0, మెకట్రానిక్స్, రోబోట్ సిస్టమ్స్ ఇంటిగ్రేషన్, యాడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎయిర్ క్రాఫ్ట్ మెయింటెనెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, డెంటల్ ప్రోస్తెటిక్స్, డిజిటల్ కన్స్ట్రక్షన్, ఇండస్ట్రియల్ డిజైన్ టెక్నాలజీ, ఐసీటీ నెట్‌వర్క్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆప్టోఎలక్ట్రానిక్ టెక్నాలజీ, వాటర్ టెక్నాలజీ పోటీలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, 01 జనవరి 2006 తర్వాత జన్మించిన వారు అటానమస్ మొబైల్ రోబోటిక్స్, కాంక్రీట్ కన్స్ట్రక్షన్ వర్క్, ల్యాండ్‌స్కేప్ గార్డెనింగ్, 3డి డిజిటల్ గేమ్ ఆర్ట్, ఆటోబాడీ రిపేర్, ఆటోమొబైల్ టెక్నాలజీ, బేకరీ, బ్యూటీ థెరపీ, బ్రిక్ లేయింగ్, క్యాబినెట్ మేకింగ్, కార్ పెయింటింగ్, కార్పెంటరీ, కెమికల్ లాబొరేటరీ టెక్నాలజీ, సిఎన్ సి మిల్లింగ్, సిఎన్ సి టర్నింగ్, కుకింగ్, డిజిటల్ ఇంటరాక్టివ్ మీడియా, ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్స్, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్ టెక్నాలజీ, ఫ్లోరిస్ట్రీ, గ్రాఫిక్ డిజైన్ టెక్నాలజీ, హెయిర్ డ్రెస్సింగ్, హెల్త్ అండ్ సోషల్ కేర్, హెవీ వెహికల్ టెక్నాలజీ, హోటల్ రిసెప్షన్, ఇండస్ట్రియల్ కంట్రోల్, ఇండస్ట్రియల్ మెకానిక్స్, ఇంటెలిజెంట్ సెక్యూరిటీ టెక్నాలజీ, ఐటి నెట్‌వర్క్ సిస్టమ్స్ అడ్మినిస్ట్రేషన్, సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, జ్యువెలరీ, జాయినరీ, లాజిస్టిక్స్ అండ్ వ్రైట్ ఫార్వార్డింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ సిఐడి, మొబైల్ అప్లికేషన్స్ డెవలప్‌మెంట్, పెయింటింగ్ అండ్ డెకరేటింగ్, పాటిసెరీ అండ్ కన్ఫెక్షనరీ, ప్లాస్టరింగ్ అండ్ డ్రైవాల్ సిస్టమ్స్, ప్లంబింగ్ అండ్ హీటింగ్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్, రెన్యూవబుల్ ఎనర్జీ, రెస్టారెంట్ సర్వీస్, రిటైల్ సేల్స్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్స్, విజువల్ మర్చండైజింగ్, వాల్ అండ్ ఫ్లోర్ టైలింగ్, వెబ్ టెక్నాలజీస్, వెల్డింగ్ లకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. కావున శ్రీ సత్యసాయి జిల్లాలోని ఆసక్తి గల యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవలసిందిగా కోరారు.

జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

రెండు దశాబ్ధాలుగా నరకం అనుభవిస్తున్న హౌసింగ్ లబ్ధిదారులు

- అధికార యంత్రాంగం సహాయ నిరాకరణే ప్రధాన కారణం

- కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తున్న 'రెవెన్యూ'

- నేడు గుడి పేరుతో స్వాహా చేయడానికి సిద్ధమైన స్వార్థపరులు

- న్యాయం చేయాలని కమిషనర్‌కు వినతిచేసిన బాధితులు

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ వెంకటప్రసాద్, హాజరైన లబ్ధిదారులు

అనంతపురం ఆగస్టు 05 ప్రభాతవార్త

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించి దాదాపు 20 ఏళ్ల గడుస్తునతన్న వారు ఇళ్లు నిర్మించుకోవడానికి మౌళిక వసతులు అధికారయంత్రాంగం కల్పించడంలో పూర్తి నిర్లక్ష్యం వహిస్తుండడంతో ఇప్పటికీ వివిధ రూపాల్లో లబ్ధిదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ 20 ఏళ్లలో ప్రభుత్వాలు మారినపుడల్లా లబ్ధిదారులు ప్రజాప్రతినిధులు, అధికారులు చుట్టూ తిరిగి వందలాది ఫిర్యాదులు అందజేసినా ఫలితం దక్కలేదు. అంతేకాకుండా కొందరు స్థలాలను తమ పార్టీ వర్గీయులకు ఇవ్వాలని వారి స్వార్థం కోసం అధికారంలోకి వచ్చిన ప్రతి పార్టీ ఛోటా నాయకులు తమదైన శైలిలో ఇబ్బందులకు గురిచేస్తుండడం, దీంతో లబ్ధిదారులు హైకోర్టును ఆశ్రయించి వారికి కేటాయించిన స్థలాలను దక్కించుకోగా, వీరికి రెవెన్యూ, హౌసింగ్ అధికార యంత్రాంగం సహకారం అందించి వారికి మంజూరు చేసిన స్థలాల హద్దులు చూపించి నిర్మాణాలకు అనువుగా మౌళిక వసతులైన రోడ్డు, మంచినీరు, విద్యుత్ వంటి సదుపాయాలు కల్పించడంలో అధికారులు పూర్తి నిర్లక్ష్యం చేయడం లబ్ధిదారులను బాధిస్తోంది. ఇలాంటి తరుణంలో ఓ ప్రబుద్ధుడు గుడి పేరుతో వీరి కేటాయించిన స్థలంలో రాళ్లు, పసుపు వంటివి చేయడంతో ఆగ్రహించిన బాధితులు బుధవారం నగరపాలక సంస్థకు వందలాది మంది లబ్ధిదారులు చేరుకుని కమిషనర్‌కు తమగోడు విన్నవించుకున్నారు. వివరాల్లోకి వెళితే..నగరంలోని పాతవూరు 14వ డివిజన్ (పాత వార్డు) ఉమానగర్ నివాసితులకు 2007లో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఉప్పరపల్లి గ్రామం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 51-2, రీ సర్వే నెంబరు 146-2, సర్వే నెంబరు 64-2, రీ సర్వే నెంబరు 147-2 లో 374 మంది అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం స్థలం కేటాయించింది. అప్పటినుంచి వీరికి ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం ఇళ్ల నిర్మాణాల కోసం మౌళిక సదుపాయలు కల్పించి సహకారం అందించకపోవడంతో ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం చోటుచేసుకుంది. అయితే తదనంతరం వైసిపి ప్రభుత్వ హయాంలో ఇతరులకు పట్టాలు ఇవ్వడానికి ప్రయత్నాలు చేస్తుండడంతో లబ్ధిదారులు పలుమార్లు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యం చేస్తూ వచ్చారు. దీంతో లబ్ధిదారులు హైకోర్టును ఆశ్రయించి తమకు కేటాయించిన ఇళ్ల స్థలాలను తమకే దక్కేలా కోర్టు నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. ఈ తరుణంలో 2018-19లో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో ఎన్‌టిఆర్ గృహాల కింద 374మందికి పిఎంఏై పథకం కింద ఇళ్ల నిర్మించుకోవడానికి మంజూరు చేసింది. అయితే అప్పటి నుంచి ఇప్పటివరకు రెవెన్యూ అధికారులు తమకు మంజూరు చేసిన ఇళ్ల పట్టాలు స్థలాల హద్దులు చూపించాలని కిందిస్థాయి నుంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు పలుమార్లు వినతిచేసినా న్యాయం జరగలేదని బాధితులు వాపోయారు. అయితే ఇటీవల కాలంలో కొందరు ప్రబుద్ధులు తమ స్థలంలో గుడిపేరుతో రాళ్లు, పసుపు, కుంకుమ వంటివి వాటితో స్థలాన్ని కాజేయడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆధారాలతో సహా పిజిఆర్ఎస్‌లో గత నెల10న వినతి చేయగా 15 రోజుల్లోపు పరిష్కరిస్తామని చెప్పి ఇప్పటివరకు అటువైపు అధికారులు కన్నెత్తి చూడలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో నగర కమిషనర్ ఎం.జస్వంతరావును కలిసి తమకు న్యాయం చేయాలని వందలాది మంది లబ్ధిదారులు బుధవారం నగరపాలకసంస్థకు చేరుకుని వినతి చేశారు. బాధితులు ఉదయం 11 గంటలకు కార్యాలయంకు చేరుకోగా కమిషనర్, కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫెరెన్స్‌లో వున్నారని చెప్పడంతో అక్కడే చెట్లకింద అన్నపానీయాలు లేకుండా దాదాపు నాలుగైదు గంటలు వేచి వుండి కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామి ఇచ్చారు.

పరిశ్రమల స్థాపనతోనే జిల్లా అభివృద్ధి సాధ్యం

- జిల్లా అభివృద్ధికి పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలి - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం కలెక్టరేట్ ఆగస్టు 5 ప్రభాతవార్త

పరిశ్రమల స్థాపనతోనే జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ ఓ. ఆనంద్ సంబంధిత అధికారులకు సూచించారు.బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు 70,వ జిల్లా పరిశ్రమల ఎక్స్ పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనతోనే జిల్లాలో అభివృద్ధి సాధ్యమవుతుందని అధికారులు పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో నూతన పరిశ్రమలు స్థాపించేందుకు అనుమతులకు సంబంధించి ఇప్పటి వరకు 68 దరఖాస్తులు రాగా అందులో 48 దరఖాస్తులకు ఆమోదం తెలపడం జరిగింది. రెండు దరఖాస్తులను వివిధ కారణాల వల్ల తొలగించడం జరిగింది మిగిలిన 18 దరఖాస్తులను త్వరలో పరిష్కరిస్తామని పరిశ్రమల శాఖ జిఎం కలెక్టర్ కు తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో 20 యూనిట్ పెట్టుబడి రాయితీ 1,88,94,691 రూపాయలు కాగా ఇందులో విద్యుత్ శక్తి రాయితీ రెండు యూనిట్లకు 47,531 రూపాయలు. ఇందులో మొత్తం రూ .1.89,42,222 రాయితీ ఇవ్వడం జరిగిందన్నారు. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీకి గార్లదిన్నె మండలంలోని కణంపల్లె లో భూమి అడగడం జరిగిందని అందుకు సంబంధించి డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ను త్వరగా తయారు చేసి తమకు పంపాలని హార్టికల్చర్ అధికారులకు సూచించారు. విశ్వకర్మ స్కీమ్ కు అర్హులైనటువంటి దరఖాస్తుదారులకు శిక్షణ ఇచ్చి వారికి అవసరమైన రుణాలు మంజూరు చేయాలని ఎల్ డి ఎం కు సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 70 ఇండస్ట్రీస్ అండ్ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశాలు నిర్వహించడం జరిగిందని, ఈ సమావేశాలు ప్రతినెలా క్రమం తప్పకుండా నిర్వహించి మరిన్ని నూతన పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని వివిధ శాఖల అధికారులకు సూచించారు. ఇంకా ఈ కార్యక్రమంలో పలు అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులకు కూలంకషంగా వివరించి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సి .విష్ణు చరణ్, పరిశ్రమల శాఖ జిఎం, లీడ్ బ్యాంకు మేనేజర్, ఉద్యానవన శాఖ, డిఆర్డిఏ పిడి శైలజ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్

సగం మేర నిండిన తుంగభద్ర జలాశయం

- వారంలోగా భర్తీ అయ్యే అవకాశం - జలాశయానికి మళ్లీ లక్ష క్యూసెక్కుల ఇన్ ఫ్లో

బళ్లారి, ఆగస్టు 4 ప్రభాతవార్త:

బళ్లారి, కొప్పళ, రాయచూరు మరియు విజయనగర జిల్లాలతో సహా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని 8 జిల్లాలకు జీవనాధారంగా ఉన్న తుంగభద్ర జలాశయానికి నీటి ప్రవాహం (ఇన్‌ఫ్లో) భారీగా పెరిగింది, ప్రస్తుతం ఇది సగం మేర నిండింది. గరిష్టంగా 1633 అడుగుల నీటి మట్టం సామర్థం కలిగిన ఈ జలాశయంలో, నీటి మట్టం బుధవారం ఉదయం 8 గంటల సమయానికి 1619.42 అడుగులకు చేరింది. మొత్తం 105.788 టిఎంసి ల నీటి నిల్వ సామర్థం కలిగిన ఈ జలాశయంలో ప్రస్తుతం 59.718 టిఎంసిల నీరు నిల్వఉంది. ఈ ఏడాదిలో మొదటిసారిగా జలాశయానికి వస్తున్న నీటి ప్రవాహం లక్ష క్యూసెక్కుల మార్కును దాటింది. గత 24 గంటల్లో జలాశయంలోకి 1,00,750 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది, అలాగే కాలువల ద్వారా 1,443 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గత ఏడాది ఇదే సమయానికి తుంగభద్ర జలాశయంలో నీటి మట్టం 1626.06 అడుగులుగా ఉండగా, నీటి నిల్వ 80.003 టియంసి లుగా నమోదైంది. మల్నాడు ప్రాంతంలో కురుస్తున్న విస్తారమైన వర్షాల కారణంగా, రాబోయే వారంలో జలాశయం పూర్తిగా నిండుతుందనే ఆశలు చిగురించాయి. మొత్తంగా చూస్తే, తుంగభద్ర జలాశయంలో నీటి మట్టం రోజురోజుకూ పెరుగుతుండటం జలాశయం ఎగువన విస్తారంగా వర్షాలు కురుస్తుండటం ప్రజల్లో, రైతుల్లో సంతోషాన్ని నింపింది.



నిండుకుండలా జలకళలాడుతున్న తుంగభద్ర జలాశయం

02ATP27_02ATP27.qxd 05-08-2026 PM 10:39 Page 1

శిశువుకు తల్లిపాలే అమృతం

ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్, ఆగస్టు 5 ప్రభాతవార్త

తల్లిపాలే శిశువుకు అమృతం అని శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదల, వ్యాధి నిరోధక శక్తి పెంపులో తల్లి పాత్ర అత్యంత కీలకమని అంగన్వాడి కార్యకర్త రాజేశ్వరి తెలిపారు. బుధవారం పట్టణంలోని న్యూ హస్నాబాద్ మూడవ అంగన్వాడి కేంద్రంలో హిందూపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ సుధా వరలక్ష్మి ఆదేశాల మేరకు, సూపర్వైజర్ శాంతి సూచనలతో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భవతులకు బాలింతలకు అవగాహన కల్పించారు. పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం అత్యంత అవసరమన్నారు. తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం పోషకాహారంతో పాటు రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించాలని సూచించారు, తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడం పాటు అనేక అంటువ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయని గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రయోజనాలను సరైన పాలిచ్చే విధానం, తల్లి శిశువు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణీలు, బాలింతలతో కలిసి తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముర్రు పాలుతో రోగ నిరోధక శక్తి పెంపొందుతుంది

సమావేశంలో తల్లులకు అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీస్

డి.హిరెహాళ్ ఆగస్టు 5 ప్రభాతవార్త

బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు పట్టడం వల్ల చిన్నారుల్లో రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతంగ ఉంటారని మహిళా పోలీస్ శ్వేత తల్లులకు అవగాహన కల్పించారు. బుధవారం డి.హిరెహాళ్ మండల కేంద్రంలోని 7వ అంగనవాడి కేంద్రంలో అంగనవాడి కార్యకర్త భాగ్యమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాలు వారోత్సవాల కార్యక్రమంలో తల్లిపాలు వల్ల కలిగే లాభాలు తదితర అంశాలను ఆమె తల్లులకు వివరించారు. తల్లి ముర్రు పాలు పిండి పడవేయకుండ అప్పుడే పెట్టిన బిడ్డకు ప్రతి అరగంటకు ఒకసారి పాలు పట్టాలని తల్లి నుండి ముర్రు పాలు బిడ్డకు తాగించడం వల్ల రోదన నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. దీంతో తల్లి బిడ్డల మధ్య అనుబంధం పెరుగుతుందని, ఈపద్ధతి పాటించడంవల్ల తల్లికి బెస్ట్ క్యాన్సర్ రాదని, తల్లి బిడ్డకు పాలు ఇస్తున్నంతవరకు గర్భం రాదని దాంతో బిడ్డకు, బిడ్డకు ఎడమ పెరుగుతుందని, బిడ్డను మెత్తటిబట్టతో మట్టివెచ్చగా పడుకో బెట్టాలని ఆమె తెలిపారు. ఈ సందర్భంగ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత వాటి వల్ల కలిగే ప్రయోజనాలు తదితర అంశాలను గర్భవతులు, బాలింతలకు, పెద్దవారికి అందరికీ అవగాహన కల్పించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛ పథం కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ యంపిడిఓ యోగేష్

స్వచ్ఛ పథం కార్యక్రమం దృశ్యం

బ్రహ్మసముద్రం ఆగస్టు 5 ప్రభాతవార్త

బ్రహ్మసముద్రం మండలంలోని బైరసముద్రం గ్రామ పంచాయతీ యందు ప్రతి బుధవారం నిర్వహించే స్వచ్ఛ పథం కార్యక్రమంను పిఓపిఆర్డి యోగేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో రోడ్డు పక్కన గల దిబ్బలను, కంపలను తొలగించి పరిశుభ్రంగా ఉంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం. ఈ కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతిరోజు తమ ఇళ్ల వద్ద అపరిశుభ్రంగా ఉంచకుండా పరిశుభ్రంగా ఉంచుకొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో యోగేష్, పంచాయతీ అభివృద్ధి అధికారి అనిల్ కుమార్, హరిత రాయబారులు మరియు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

బాధిత రైతుల సదస్సును జయప్రదం చేయండి

రైతులకు అవగాహన కల్పిస్తున్న సిపిఎం నాయకులు

డి.హిరెహాళ్ ఆగస్టు 5 ప్రభాతవార్త

సోలార్ కంపెనీ బాధిత రైతుల రాష్ట్ర సదస్సును జయ ప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశే ఖర్ రెడ్డి, జిల్లా కమిటీ జయచంద్రా రెడ్డి, హరినాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం డి. హిరెహాళ్ మండల పరిధిలోని గొడిసెలపల్లి, ఎస్.ఆర్. కోట, హనుమా పురం, మురిడి గ్రామాలలో బాధిత రైతులను కలుసుకొని కరపత్రాలు పంచు తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 14న గుత్తి పట్టణంలోని నిజామి షాది ఖానా ఫంక్షన్ హాలులో జరగనున్న సోలార్ బాధితులు రైతుల రాష్ట్ర సదస్సుకు పెద్ద సంఖ్యలో హాజరై సభను జయప్రదం చేయాలని సిపిఎం అనుబంధ సంస్థల నాయకులు రైతులకు సూచించారు. సోలార్ కంపెనీల నుండి రైతుల భూములను కాపాడాలని సోలార్ కంపెనీల మోసపూరిత ఒప్పందాలపై రైతులు మేల్కొనాలని వారు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులపై మోసం చేసే విధానాలకు నిరసనగా రైతుల్లో అవగాహన కల్పించేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి లోకేష్, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు గోపాల్ రెడ్డి, గంగిరెడ్డి, సోలార్ బాధిత రైతులు గోవింద్ రెడ్డి, వన్నారెడ్డి, తిప్పారెడ్డి, పన్నూరుస్వామి, నారాయణరెడ్డి, శివారెడ్డి, మల్లికార్జున, గాదిలింగ, భాస్కర్, ఆనంద్, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు చేయాలని ఆందోళన

ఆందోళన చేస్తున్న దృశ్యం

చిలమత్తూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త

చిలమత్తూరు మండలంలోని పెద్దనపల్లి గ్రామ సమీపంలో చేపడుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనుల కారణంగా గ్రామానికి రాకపోకలు ఇబ్బందికరంగా మారాయని పెద్దనపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు చేయకుండా పనులు కొనసాగిస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు గ్రామస్తులు హైవే నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం నిరసన చేపట్టారు. గ్రామ ప్రజలకు సురక్షితమైన రాకపోకలు కల్పించేలా వెంటనే ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేసిన తరువాతే పనులు కొనసాగించాలని కోరారు. ఆందోళనకు సిపిఎం నాయకుడు ప్రవీణ్‌కుమార్ మద్దతు తెలిపారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా అభివృద్ధి పనులు చేపట్టడం సరికాదని, అధికారులు, హైవే నిర్మాణ సంస్థ వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామ ప్రజలకు న్యాయం జరిగే వరకు సిపిఎం అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఫిరంగి ప్రవీణ్‌కుమార్, పెద్దనపల్లి గ్రామస్తులు ప్రవీణ్‌కుమార్, శివప్ప, శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖరరెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, శివారెడ్డి, శ్రీనివాసులు, సూరి, సూర్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన

తల్లిపాల ఆవశ్యకతపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చిలమత్తూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త

మండలంలోని దేమకేతేపల్లి సెక్టార్‌లోని కొర్లకుంట అంగన్‌వాడి కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భవతులు, బాలింతలకు అవగాహన కల్పించారు. శిశువు పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించాలని, మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలు శిశువుకు పౌష్టికాహారం అందించి రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దోహదపడతాయని తెలిపారు. అనంతరం తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనిత, ఏఎన్ఎం మీనాక్షి, ఉపాధ్యాయులు గోపాలరెడ్డి, సిఆర్‌పి ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

నేడు లేపాక్షి వీరభద్రాలయంలో హుండీ లెక్కింపు

లేపాక్షి, ఆగస్టు 5 ప్రభాతవార్త

లేపాక్షిలో వెలసిన శ్రీవీరభద్రస్వామి ఆలయం హుండీని గురువారం ఉదయం 10.30 గంటలకు లెక్కించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమానికి గ్రామస్తులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పెద్దఎత్తున హాజరుకావాలని ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్ పరిగి వేణుగోపాలరావులు బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

పెళ్లి సంబంధాలు కుదరక మనస్తాపం... యువతి ఆత్మహత్య

శెట్టూరు, ఆగస్టు 05 ప్రభాతవార్త

జ్యోతి ఫైల్ ఫోటో

మండల కేంద్రంలో పెళ్లి సంబంధాలు కుదరక తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... శెట్టూరు గ్రామానికి చెందిన వడ్డే జ్యోతి (37), తండ్రి వడ్డే దైవదీనం, నర్సింగ్ వరకు విద్యాభ్యాసం పూర్తి చేసింది. ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో ఆమెకు వివాహం చేయాలని కుటుంబ సభ్యులు పలుమార్లు పెళ్లి సంబంధా లు చూసినప్పటికీ ఏ ఒక్కటి కూడా కుదరలేదు. తనకు ఎన్ని సంబంధాలు చూసినావివాహం జరగడంలేదని, ఇక జీవితంలో పెళ్లి కాదేమోనని భావిస్తూ కొంతకాలంగా మనస్తాపానికి గురైన జ్యోతి, బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి వడ్డే లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం వ్యసనం మరో కుటుంబంలో విషాదం... కూలీ ఉరివేసుకుని ఆత్మహత్య

పొలంలోని చెట్టుకు ఉరివేసుకున్న స్థితిలో మృతదేహం లభ్యం

శెట్టూరు, ఆగస్టు 05 ప్రభాతవార్త

బెస్త నాగభూషణ ఫైల్ ఫోటో

మండలంలోని లక్ష్మంపల్లి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బెస్త నాగభూషణ (45), తండ్రి బెస్త పెద్ద అప్పయ్య, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అయితే అతనికి మద్యానికి బానిసైన అలవాటు ఉండడంతో కుటుంబ సభ్యులను నిర్లక్ష్యం చేస్తూ ఉండేవాడని గ్రామస్తులు తెలిపారు. ఈ నెల 2వ తేదీన మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని భార్య బెస్త లక్ష్మిని కోరగా, అప్పటికే ఎక్కువగా మద్యం సేవించి ఉన్నాడని, డబ్బులు లేవని ఆమె చెప్పింది. దీంతో డబ్బులు ఇవ్వకపోతే నేను చనిపోతాను అని బెదిరించి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి నాగభూషణ ఇంటికి తిరిగి రాలేదు. బుధవారం (0508 2026) గ్రామానికి చెందిన బోయ బోజ్జప్ప పొలంలోని కంప చెట్టుకు నాగభూషణ ఉరివేసుకుని వేలాడుతున్నట్లు గ్రామస్తులు గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతుడి భార్య బెస్త లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై సుమన్ తెలిపారు.

ఘనంగా నవోదయ ఫౌండేషన్ డే

- ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్
- ప్రతిభావంతులైన విద్యార్థులకు కలెక్టర్ బహుమతుల ప్రదానం
- సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించిన విద్యార్థులు

నవోదయ ఫౌండేషన్ డే కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్,విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్

లేపాక్షి, ఆగస్టు 5 ప్రభాతవార్త

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో బుధవారం నవోదయ 40వ ఫౌండేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమానికి శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్, విఎంసీ చైర్మన్ శ్యాంప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాఠశాల ప్రిన్సిపాల్ నాగరాజు అధ్యక్షత వహించి స్వాగతోపన్యాసం చేస్తూ నవోదయ ఆవిర్భావ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు.

విద్యార్థులు లక్ష్యసాధన దిశగా శ్రమించాలి : కలెక్టర్

నవోదయ విద్యాలయ ఫౌండేషన్ డే సందర్భంగా కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల కర్తవ్యం, విజయాన్ని సాధించడానికి అవసరమైన కోర సాధన గురించి మార్గదర్శనం చేశారు. పెద్దలు, తల్లిదండ్రులు, గురువులతో పాటు ప్రతి ఒక్కరి పట్ల వ్యవహరించాల్సిన గౌరవప్రదమైన తీరును, శారీరక, మానసిక వికాసానికి క్రీడల ప్రాముఖ్యతను వివరించారు.

ప్రతిభావంతులకు బహుమతుల ప్రదానం :

10వతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కలెక్టర్ బహుమతులను అందజేశారు. 10వతరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు. కె.లాస్యరెడ్డి (98 శాతంతో మొదటి ర్యాంకు), కె.కిరణ్‌తేజ (94.6 శాతంతో రెండో ర్యాంకు), ఎస్. అభిరామ్ (94.4 శాతంతో మూడో ర్యాంకు), వై. స్నేహలత (94.4 శాతంతో మూడో ర్యాంకు), ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన ఎస్.చిత్రలేఖ (87.4 శాతంతో మొదటి ర్యాంకు), పి. హేమలత (86.2 శాతంతో రెండో ర్యాంకు), ఎన్.కార్తీక్ సాయి (85.6 శాతంతో మూడో ర్యాంకు) సాధించగా వారికి కలెక్టర్ బహుమతులు అందచేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు :

వేడుకల్లో భాగంగా జెఎన్‌వి మదనపల్లె విద్యార్థులు "ఇంట్యూషన్ ప్రోగ్రామ్" ప్రదర్శించగా, జెఎన్‌వి లేపాక్షి విద్యార్థులు ప్రదర్శించిన "రిథమిక్ యోగా డాన్స్", క్లాసికల్ డాన్స్ వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు (అలుమ్ని) వేమనారాయణ, డాక్టర్ వెంకటరమణ, రాజారెడ్డి, రమణారెడ్డితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రాష్ట్ర సర్వతోముఖ అభివృద్ధి చంద్రబాబు ద్వారానే సాధ్యం

ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ,

ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం

అమరాపురం ఆగస్టు 5 ప్రభాతవార్త

నీటి సమస్య తెలుసుకుంటున్న దృశ్యం

మండల పరిధిలోని కె శివరం, పి శివరం గ్రామాలలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వా మిలు పాల్గొని ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలతో పాటు మడకశిర నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమా లను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశించారు. పి శివరంలో త్రాగునీటి సమస్యను మహిళలు వివరించగా తక్షణం ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు రెండు రోజుల్లోపు పరిష్కరిం చాలని తెలియజేశారు. అదేవిధంగా పి శివరం గ్రామంలో రోడ్డు పక్కనే ఉన్న ప్రభుత్వ భూమినీ ఇండ్ల స్థలాల కోసం కేటాయించాలని, కొందరు ఈ స్థలాన్ని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీల దృష్టికి తీసుకెళ్లారు. తక్షణం నిరుపేదలకు ఇంట్ల స్థలాలను అందజేయాలని రెవెన్యూ అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానికంగా ఉన్న రోడ్డు త్రాగునీరు దేవాలయ నిర్మాణం తదితర సమస్యలను ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీల దృష్టికి స్థానిక నాయకులు తీసుకెళ్లారు. రాష్ట్ర సర్వతోముఖ అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రి నారా లోకేష్ ల ద్వారానే సాధ్యమని గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రం అభివృద్ధిలో వెనుక బడిపో యిందని ఈ సందర్భంగా తెలిపారు. శివరంలో బార్బర్ షాప్ లో ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో భాగంగాఎమ్మెల్యే వెళ్లి షేవింగ్ చేయించుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అడిగి తెలుసుకున్నారు. స్థానిక నాయకులు పంచాయతీ పరిధిలోని సమస్యలను వివరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ర్తిలగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ,మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సింగల్ విండో అధ్యక్షుడు గణేష్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మారుతీ ప్రసాద్, మాజీ కన్వీనర్ శివ రుద్రప్ప, జడ్పిటిసి పి ఆర్ మూర్తి,,డైరెక్టర్ దాదా పీర్, మాజీ ఎంపీపీ రామిరెడ్డి,, నాగోనపల్లి మంజునాథ్, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి కేఎన్ పల్లి సురేష్, రాష్ట్ర అధ్యక్షుడు పాండురంగప్ప, బీసీ సెల్ కార్యదర్శి రామ్మూర్తి, పంచాయతీ కన్వీనర్ చిక్కన్న, మాజీ సర్పంచులు ఈరన్న, మల్లికార్జునప్ప, చెరువు సంఘం అధ్యక్షుడు ఈరమల్లప్ప, మాజీ అధ్యక్షుడు సీతారామప్ప, డీలర్ రమేష్, గుజ్జారప్ప,ప్రభాకర్, మాజీ ఎంపీపీ సంతోష్, టీచర్ గోవిందప్ప,డీలర్లు గోవిందప్ప ,నరేష్, పాండురంగప్ప జనసేన నాయకుడు శివకుమార్, నగేష్, ఈశ్వరప్ప, టిడిపి మహిళా నాయకురాలు రత్నమ్మ, శివరం మంజు, అశోక్, విజయ్,ఫీల్డ్ అసిస్టెంట్లు గిరీష్ మంజు, తిమ్మన్న, శ్రీరామ్ మల్లికార్జున, మాలింగప్ప,,తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీ డైరెక్టర్‌గా శ్రీవాణి

గేట్స్ కళాశాల డైరెక్టర్ శ్రీవాణి

గుత్తి, ఆగస్టు 5 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన పాలకవర్గం డైరెక్టర్‌గా స్థానిక గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ వీకే శ్రీవాణి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో నోటిఫికేషన్ జారీ కాగా ప్రస్తుతం నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో ఆమెను డైరెక్టర్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద మానవతా సేవా సంస్థ అయిన రెడ్ క్రాస్‌లో సేవా భావానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. ఆమె ఎంపిక పట్ల కళాశాల ఎండి రఘునాథ్‌రెడ్డి, కరస్పాండెంట్ వీకే పద్మావతి, సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి పరేడ్‌కు ఇరువురు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు

-ఆగస్టు 15న విజయవాడలో జరిగే పరేడ్‌లో పాల్గొననున్న విద్యార్థులు

రాష్ట్రస్థాయి పరేడ్‌కు ఎంపికైన బి.పరుశురాముడు, టి.రాజ్‌కుమార్‌తో ప్రిన్సిపాల్ డా॥టి.శైలజారాణి, పీడీ బి.ప్రశాంత్‌కుమార్

ఉరవకొండ, ఆగస్టు 5 ప్రభాతవార్త

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15వ తేదీన విజయవాడలో జరుగనున్న రాష్ట్రస్థాయి పరేడ్‌కు యూత్ రెడ్‌క్రాస్ కంటింజెంట్ తరపున ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు బి.పరుశురాముడు (బీకాం, 3వ సంవత్సరం), టి.రాజ్‌కుమార్ (బీఏ, 2వ సంవత్సరం) ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డా॥టి.శైలజారాణి తెలిపారు. బుధవారం ఆమె స్థానిక విలేఖరులకు వివరాలు వెల్లడించారు. పరేడ్ నిమిత్తం ఇరువురు విద్యార్థులు అమరావతిలో విట్ యూనివర్సిటీలో ఈనెల 6వ తేదీ నుండి ప్రత్యేక శిక్షణ పొందుతారన్నారు. శిక్షణ అనంతరం ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్‌లో పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయి పరేడ్‌కు ఎంపికై కళాశాలకు మరింత గుర్తింపు తెచ్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ డా॥టి.ఎన్.మస్తానప్ప అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో శ్రమించి గొప్ప అవకాశాన్ని దక్కించుకున్నారని వారు కొనియాడారు. ఈ సందర్భంగా యూత్ రెడ్ క్రాస్ కన్వీనర్, బోటని లెక్చరర్ విష్ణుప్రియ, ఎన్‌సీసీ కేర్ టేకింగ్ ఆఫీసర్, ఫిజికల్ డైరెక్టర్ బి.ప్రశాంత్‌కుమార్, అధ్యాపకులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఒరిగిపోయి గాలికి ఊగుతున్న విద్యుత్ స్తంభం..!

-స్తంభం కూలితే ఆస్తి, ప్రాణ నష్టం తప్పదని భయాందోళనలు

ఉరవకొండ, ఆగస్టు 5 ప్రభాతవార్త

ఒక వైపుకు ఒరికిపోయి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

ఉరవకొండ పట్టణంలోని 10వ వార్డు రంగా వీధి పాత బళ్లారి రోడ్డులోని ఒక ఇనుప విద్యుత్ స్తంభం ఒక వైపుకు ఒరిగిపోయి గాలికి ఊగుతోంది. దాదాపు 40 సంవత్సరాల క్రితం వేసిన విద్యుత్ స్తంభం కావడంతో అది త్రుప్పుపట్టి పునాది దెబ్బతినడంతో ఒరిగిపోయిం ది. పెద్దగా గాలి వీచిన సమయంలో స్తంభం ఊగుతుందని దీంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కు బిక్కుమంటూ గడపాల్సి వస్తోందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. నిత్యం రద్దీగాఉండే రోడ్డులో క్లినిక్,మెడికల్ షాపులకు సమీపంలోని విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉన్నా విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. సదరు విద్యుత్ స్తంభానికి దాదాపు 50 వరకు గృహ, వ్యాపార సముదాయాల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని స్తంభం భారీ ఈదురు గాలులకు కూలిపోతే ఆస్తి, ప్రాణ నష్టం జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయంటున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు వెంటనే స్పందించి కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

తల్లిపాల వల్లే...శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం

- ఖాజాపురం, మందలపల్లి గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు
- ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో కార్యక్రమాలు

కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సూపర్‌వైజర్

గోరంట్ల, ఆగస్టు 5 ప్రభాతవార్త

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గోరంట్ల మండలంలోని మందలపల్లి పంచాయతీ పరిధిలోని ఖాజాపురం మరియు మందలపల్లి అంగన్‌వాడి కేంద్రాల్లో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగరాణి గర్భవతులు, బాలింతలు మరియు కుటుంబసభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ శిశువు జన్మించిన మొదటి గంటలోపు తల్లి పాలు పట్టించడం ఎంతో అవసరమని తెలిపారు. పుట్టిన వెంటనే వచ్చే పసుపు రంగు పాలు (కొలస్ట్రం) శిశువుకు సహజ రోగనిరోధక శక్తిని అందించే తొలి టీకా వంటిదని వివరించారు. జననం నుండి మొదటి ఆరు నెలల వరకు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని, ఈ కాలంలో నీరు, తేనె లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వకూడదని సూచించారు. ఆరు నెలల తర్వాత ఇంట్లో తయారుచేసిన పౌష్టికాహారాన్ని ప్రారంభించి, రెండు సంవత్సరాలులేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లి పాలను కొ

03ATP05_03ATP05.qxd 05-08-2026 PM 10:59 Page 1

27 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం, జులై 5 ప్రభాతవార్త బ్యూరో

ఈనెల 27 నుంచి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.చిత్తప్ప, కె.వీరరాజు తెలియజేశారు. చెకుముకి సైన్స్ సంబరాలకు సంబంధించిన పోస్టర్లను బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఆయుబ్ హుస్సేన్ చేత విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పరిశోధన ఆసక్తి, సృజనాత్మకతను పెంపొందించాలనే లక్ష్యంతో ఈ సంబరాలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. శాస్త్రీయ సమాజం ఏర్పాటు లక్ష్యంగా గత నాలుగు దశాబ్దాలుగా జెవివి తెలుగు ప్రజలతో మమేకమై పనిచేస్తుందన్నారు. అందులో భాగంగానే భావితరాలలో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించేందుకు పాఠశాలలు కేంద్రంగా పనిచేస్తుందని వారు తెలియజేశారు. ఈనెల 27న పాఠశాల స్థాయిలో సెప్టెంబర్ 11న మండల స్థాయిలో, సెప్టెంబర్ 27న జిల్లాస్థాయిలో ఈ సంబరాలు జరుగుతాయని అన్నారు. 8,9,10వ తరగతి విద్యార్థులు అందులో పాల్గొనవచ్చని, కావున ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. జిల్లా స్థాయిలో జరిగే కార్యక్రమంలో తాను పాల్గొంటున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి తెలియజేసినట్లు వారు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, నగర ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపాల్ నగర నాయకులు నాగ రంగ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న
శ్రీ వాణి ఎక్సెల్ అకాడమీ మీద చర్యలు తీసుకోవాలి

అధికారికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్ఆర్సిపి విద్యార్థి విభాగం నేతలు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 5 ప్రభాతవార్త

ఇంటర్మీడియట్ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న విద్యాసంస్థలపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం ప్రాంతీయ పర్యవేక్షణ అధికారికి ఆయన ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ.. అనంతపురంలో "శ్రీ వాణి ఎక్సెల్ అకాడమీ" పేరుతో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బోధన నిర్వహిస్తున్నారని, ఒక జూనియర్ కళాశాలలో ప్రవేశాలు కల్పించి, వేరే ప్రాంగణాల్లో తరగతులు నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉందని, దీనిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నవీన్ రెడ్డి,సుధీర్ రెడ్డి, నగర ప్రధాన కార్యదర్శులు ఫయాజ్, మనోజ్, బబ్లు, హరీష్, చరణ్, కార్తికేయ, రఫీ, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

నూతన జిల్లా విద్యాధికారికి శుభాకాంక్షలు తెలిపిన పలువురు నాయకులు

డిఇఓకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 5 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయూబ్ హుస్సేన్‌కి ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం, అనంతపురం జిల్లా శాఖ తరపున డీఈఓ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆపస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజేంద్రప్రసాద్, అనంతపురం జిల్లా అధ్యక్షురాలు కళ్యాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు పి.శివప్రసాద నాయుడు, వై.రామన్న, హర్షవర్ధన్, జిల్లా కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి బోరుకి ఒక ఉద్యోగి కేటాయింపు

- ఎంపిడిఓ భాస్కర్

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ భాస్కర్, హాజరైన సిబ్బంది

శింగనమల, ఆగస్టు 5 ప్రభాతవార్త

మండల పరిధిలో ఉన్న 97 ప్రభుత్వ బోరులకు, ప్రతి బోరుకు ఒక సచివాలయ ఉద్యోగిని కేటాయించినట్లు ఎంపిడిఓ భాస్కర్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ భాస్కర్ ఆధ్వర్యంలో పంచాయితీ కార్యదర్శిలు, ఉపాధిహామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ భాస్కర్ మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో మండల పరిధిలో నీటి ఎద్దడి లేకుండా ఇప్పటి నుంచే ప్రణాళికలు తయారు చేసుకుని ప్రతి బోరు బావికి ఒక ఉద్యోగిని కేటాయిస్తూ ఆ బోరు బావికి సంబంధించిన ఏ విషయమైనా మోటరు పనితీరు, నీరు వెళ్తున్న స్థలం తదితర సమగ్ర వివరాలన్నీ సంబంధిత ఉద్యోగి దగ్గర ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ విజయ్‌కుమార్, ఉపాధిహామీ ఏపిఓ భాగ్యలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్‌లు పాల్గొన్నారు.

13 నుంచి జిల్లా స్థాయి అమరావతి ఛాంపియన్ షిప్ పోటీలు

- డిఎస్‌డిఓ మంజుళ

అనంతపురం సిటీ, ఆగస్టు 5 ప్రభాతవార్త

జిల్లా స్థాయి అమరావతి ఛాంపియన్ షిప్ పోటీలు ఈ నెల 11 నుంచి 13 వరకు నిర్వహించడం జరుగుతుందని డిఎస్‌డిఓ మంజుళ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11న అండర్-17 బాలుర బాలికల కోకో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు ఆర్ట్స్ కళాశాల మైదానంలో బాక్సింగ్, బ్యాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ఇండోర్ స్టేడియంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే విధంగా 12న అండర్-23 కోకో, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్ పోటీలు ఆర్ట్స్ కళాశాల మైదానంలోనూ, బాక్సింగ్, బ్యాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఇండోర్ స్టేడియంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. 13న అండర్-17, అండర్-23 అథ్లెటిక్స్, ఆర్చరీ, హాకీ పోటీలు ఆర్ట్స్ కళాశాల మైదానాంలో, టెన్నిస్ యోగా పోటీలు ఇండోర్ స్టేడియంలో నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు.

యువత లక్ష్యసాధన దిశగా పయనించాలి

- ఈగల్ విభాగం ఎస్ఐ హనుమంతు
- గంజాయి, డ్రగ్స్, ప్రమాదాలు, యువత భవిష్యత్తు, భద్రతపై అవగాహన

డ్రగ్స్ నిర్మూలనపై ర్యాలీ చేస్తున్న దృశ్యం

పామిడి, ఆగస్టు 05 ప్రభాతవార్త

యువత తాత్కాలిక ప్రయోజనాల కోసం కాకుండా లక్ష్యసాధన దిశగా పయనించాలని ఈగల్ విభాగం ఎస్ఐ హనుమంతు పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అనంతపురం ఈగల్ విభాగం ఆధ్వర్యంలో గంజాయి, డ్రగ్స్, ప్రమాదాలు, యువత భవిష్యత్తు, భద్రతపై అవగాహన కల్పిస్తూ బుధవారం వివిధ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులతో కలిసి పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఈగల్ విభాగం ఎస్ఐ హనుమంతు మాట్లాడుతూ విద్యార్థుల ఆకర్షణ మోజులో పడి బంగారు భవిష్యత్తును దూరం చేసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలిపారు. విద్యార్థి దశ నుండే విద్యార్థులకు మత్తు పదార్థాలను అలవాటు చేసి దనార్జనే ధ్యేయంగా అక్రమార్కులు వ్యవహరిస్తున్నారని, మాదక ద్రవ్యాల వాడకం ద్వార యువత భవిష్యత్తు అంధకారం అవుతుందని సరదాగా మొదలయ్యే అలవాటుతో చివరకి బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలియజేశారు. మత్తు పదార్థాల నివారణకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని, ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం డ్రగ్స్ రవాణ, నిల్వ, వినియోగం, విక్రయానికి విధించే శిక్షలను వివరిం చారు. డ్రగ్స్‌కి సంబందించి అనుమానస్పద కార్యకళాపాలు జరుగుతున్నట్లు గుర్తించినప్పుడు ఈగల్‌సెల్ టోల్‌ఫ్రీ నెంబర్ 1972కి తెలియజేయాలని సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. మత్తు రహిత సమాజ నిర్మాణంలో ప్రతిపౌరుడు బాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వద్దు చదువు ముద్దు.. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి.. యువత భవిష్యత్తును కాపాడుకుందాం.. డ్రగ్స్‌కు నో చెప్పండి.. డ్రగ్స్ వద్దు బ్రో.. జీవితాన్ని ప్రేమించండి.. భవిష్యత్తును కాపాడుకోండి అంటూ విద్యార్థులచే ఈగల్ విభాగం ఎస్ఐ హనుమంతు ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో శ్రీ చైతన్య టెక్నో పాఠశాల డైరెక్టర్ రమణారెడ్డి, శ్రీ సరస్వతీ విద్యామందిరం ప్రధానాచార్యులు రవిబాబు, ఆయాపాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కుల వివక్ష నిర్మూలనకు సంకల్పం

-విమర్శలు కాదు గౌరవమే లక్ష్యం
- కుల వివక్ష లేని గ్రామ నిర్మాణం మన అందిరి బాధ్యత
- రాజ్యాంగ విలువలే మార్గదర్శకం

సమావేశంలో పాల్గొన్న అధికారులు కరియమ్మదేవాలయంలో సహబంతి భోజనాలు చేస్తున్న గ్రామస్తులు అధికారులు

బుక్కరాయసముద్రం ఆగష్టు 5 ప్రభాతవార్త

కుల వివక్ష నిర్మూలనకు ప్రతి పౌరుడు కృషిచేయాలి,విమర్శలు కాదు గౌరవమే లక్ష్యం,రాజ్యాంగ విలువలే మార్గదర్శకం అని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. బుదవారం బుక్కరాయసముద్రం మండల పరిదిలోని రోటరీపురం గ్రామంలో వజ్రం గంగరాజు విజ్ఞప్తి తో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామంలో కుల నిర్మూలన పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅథితులుగా రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ హేమంతకుమార్,తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి,సిఐ సుబ్బరాయుడు, ఎస్సై ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగ వారు మాట్లడుతూ మన మందరం ఒకరినొకరు విమర్శించుకోవడానికి కాదు పరస్పరం గౌరవించుకోవడానికి సమావేశమయ్యాం అని పేర్కొన్నారు. కుల వివక్ష లేని గ్రామ నిర్మాణం మనందరి బాధ్యత అని స్పష్టం చేశారు.భారత రాజ్యాంగం ప్రతి పౌరుడుకి సమానత్వం, సేచ్ఛ,సోదరభావం, న్యాయం అనే విలువలను అందించినదని తెలిపారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించి ప్రతి ఒక్కరి హక్కులను పరిరక్షించారని గుర్తు చేశారు.అనంతరం కరియమ్మ దేవాలయంలో సహబంతి భోజనాలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో వారితోపాటు నెరిమెట్ల ఎల్లన్న,బండారు కుళ్ళాయప్ప,చిన్నఆంజనేయులు, ఆర్ సోమశేఖర్,ఆర్ జగదీశ్వరప్రసాద్,జి. నారాయణస్వామి,డి. నారాయణస్వామి,ఆర్.నాగరాజు, పి.విశ్వనాథ్, పి.రవీంద్ర, బండారు చంద్ర,గంగులు,నారాయణ, అనుమేష్,నాగ,నాగేంద్ర,స్టోర్ డీలర్ ఎర్రిస్వామి,ఆర్డీటీ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ రైల్వే సమస్యల పరిష్కరించండి

మొదటిపేజీ తరువాయి...

అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్ల నిర్మాణం, రైల్వే స్టేషన్ల అభివృద్ధి వంటి అంశాలను సమగ్రంగా వివరించారు.గత పది సంవత్సరాలుగా రోజు విడిచి రోజులో వారానికి మూడు రోజులు మాత్రమే నడుస్తున్న కొండవీడు ఎక్స్‌ప్రెస్ (17211/17212) రైలును ప్రతిరోజూ నడపాలని కోరారు. మచిలీపట్నం-యశ్వంత్‌పూర్ మార్గంలో ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు, కుటుంబ సభ్యులు, ముఖ్యంగా అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని వివరించారు. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ రైలును రోజువారీ సర్వీసుగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఉదయంవేళలో గుంతకల్లు-బెంగళూరు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించాలని కోరారు. విజయవాడ-బెంగళూరు, వందేభారత్ ఎక్స్ ప్రెస్, విశాఖపట్నం-బెంగళూరు వందే భారత్ స్లీపర్ రైళ్లను అనంతపురం మీదుగా ప్రతిరోజూ నడపాలని ఆయా పార్లమెంట్ పరిధిలోని టీడీపీ ఎంపీలందరూ ఎంపీ అంబికాతో పాటు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ని కోరారు. దీనిపై కేంద్ర మంత్రి అశ్విన్ వైష్ణవ్ సానుకులంగా స్పందించి, అక్టోబర్ నెల నుంచి విశాఖపట్నం-బెంగళూరు వందే భారత్ స్లీపర్ రైలును నడపడానికి సుముఖత వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న రైళ్లలో అధిక రద్దీ కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, కుటుంబాలకు వేగవంతమైన, సౌకర్యవంతమైన రైలు సేవలు అవసరమని, ఈ రైళ్లు ప్రారంభమైతే ప్రయాణ సమయం గణనీయంగా తగ్గడంతో పాటు ఆంధ్రప్రదేశ్-కర్ణాటక రాష్ట్రాల మధ్య ఆర్థిక, పారిశ్రామిక, విద్యా, వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ప్రత్యేకంగా మంత్రి గారికి ఎంపీ అంబికా వివరించారు. ఎంపీ సమర్పించిన వినతిపత్రాన్ని సానుకూలంగా స్వీకరించిన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన అన్ని ప్రతిపాదనలను రైల్వే బోర్డు అధికారులతో సమీక్షించి, సాధ్యమైన మేరకు సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతపురం జిల్లాకు మెరుగైన రైల్వే సౌకర్యాలు, ఆధునిక మౌలిక వసతులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు.

టెట్ పరీక్షలు ప్రారంభం

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 5ప్ర ప్రభాతవార్త

టెట్ పరీక్షలు బుధవారం ప్రారంభమైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలోని 6(ఆరు) పరీక్షా కేంద్రాలకుగాను, 05 పరీక్షా కేంద్రాలలో రెండు సెషన్స్‌లకు గాను ఉదయము 9.30 గం నుండి 12.00 గం. వరకు, మధ్యాహ్నం 2.30.గం. నుండి 5.00గం. వరకు నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 1433 అభ్యర్థులకుగాను 1338 మంది అభ్యర్థులు హాజరు అయినారు. 95 మంది అభ్యర్థులు గైరుహాజరు అయినట్లు జిల్లా విద్యాశాఖాధికారి తెలియజేశారు.

పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఈఓ

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ డా.ఎన్.అయూబ్ హుస్సేన్

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 5న ప్రభాతవార్త

నగరంలోని శ్రీకృష్ణదేవరాయల నగరపాలక ఉన్నత పాఠశాలను బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి డా.ఎన్.అయూబ్ హుస్సేన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట ప్రార్థనలో విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఆ తర్వాత పాఠశాలలో అటెండెన్స్‌తో పాటు ఇతర రికార్డులను పరిశీలించారు. అలాగే పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. గతం కంటే ఈ సారి పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలని, ఆ విధంగా హెచ్ఎం, టీచర్లు విద్యార్థులకు అర్థమయ్యేలా బోధనలు చేయాలని, ప్రతి ఒక్కరు సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, ఏపీవో మంజునాథ్ నాయుడు పాల్గొన్నారు.

మత్స్యకారుల జిల్లా కార్యవర్గంలో పలువురికి చోటు

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు జశ్వంత్ వ్యాస్

అనంతపురం కల్చరల్, ఆగస్టు 5 ప్రభాతవార్త

మత్స్యకారుల అభ్యున్నతే ధ్యేయంగా శ్రమిస్తామని మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షులు జశ్వంత్ వ్యాస్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని కోర్టు రోడ్డులో గల శివకృప కార్యాలయంలో మత్స్యకార సంక్షేమ సమితి సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కార్యవర్గంలోకి పలువురికి అవకాశం కల్పించినట్లు జిల్లా అధ్యక్షులు జశ్వంత్ వ్యాస్‌తోపాటు రాష్ట్ర కార్యదర్శి నారాయణ మర్తి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మత్స్యకారుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తామన్నారు. రాయితీలు, సంక్షేమ పథకాలు అర్హులైన మత్స్యకారులకు అందేలా చూస్తామన్నారు. అనంతరం కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా శివశంకర్, న్యాయవిభాగం జిల్లా అధ్యక్షులుగా బెస్త ఓబులరాజు, జిల్లా సలహాదారునిగా తుపాకుల శంకర్, జిల్లా ప్రచార కార్యదర్శిగా బెస్త రాములను ఎంపిక చేశారు. సమావేశంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కోటా రాజేశ్వరి, రాష్ట్ర మహిళా సభ్యురాలు వనజ వాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొడుగు నాగరాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పిల్లి మద్దిలేటి, జిల్లా గౌరవ సలహాదారులు వరదాయపల్లి మాజీ సర్పంచ్ బెస్త రమణ, బెస్త గంగప్ప, జిల్లా ఇన్‌ఛార్జ్ శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు బెస్త విజయ సత్యం, బెస్త వెంకటేష్, జిల్లాల కోశాధికారి బెస్త రామాంజనేయులు, నగర అధ్యక్షులు బెస్త అశోక్, సభ్యులు బెస్త శంకర్ ప్రసాద్, బెస్త నారాయణస్వామి, బెస్త మల్లికార్జున, బెస్త శ్రీరాం, బెస్త అంజి, బెస్త ఓబులేసు, బెస్త ఓబులయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజేష్ మీద దాడి చేసిన రౌడీషీటర్లను వెంటనే అరెస్టు చేయాలి !

మాట్లాడుతున్న ఐఎఫ్‌టియు నాయకులు

అనంతపురం, ఆగస్టు 5 ప్రభాతవార్త బ్యూరో

కూడేరు మండలం ముద్దలాపురం గ్రామపంచాయతీలో లక్ష్మిదేవిమ్మ కాలనీలో ఐఎఫ్‌టియు మండల కార్యదర్శి రాజేష్ వారి భార్య వారి బంధువు భాస్కర్ వారి భార్యలపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఐఎఫ్‌టియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు బుధవారం మీడియాతో మాట్లాడుతూ బాధితులను మాట్లాడాలని రాయుడు అనే వ్యక్తి పిలిపించి అనంతపునరం నగరానికి చెందిన కటారి నాగరాజు, టోపీ నాగరాజు, కృష్ణ రౌడీ షీటర్లతో దాడి చేయించి కులం పేరుతో దుర్భాషలాడి, మమ్మల్ని ప్రశ్నిస్తారా మమ్మల్ని నిలదీస్తారా అని బండ బూతులు తిడుతూ దాడి చేసినట్లు వారు వాపోయారు. ఈ దాడిని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు) జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని నాయకులు తెలిపారు. లక్ష్మిదేవిమ్మ కాలనీలో ఐఎఫ్‌టియు నాయకులు రాజేష్, వారి బంధువు భాస్కర్‌కు ఒక్కొక్క ఇంటి స్థలం ఉన్నాయి. వాటిని రాయుడు స్వాధీనం చేసుకొని వేరే వారికి అమ్ముకోవాలని ప్రయత్నించడంతో దాన్ని అడ్డుకొని నిలదీస్తూ మాట్లాడి నందుకు ఈ దురాగతానికి పాల్పడినట్లు వారు తెలియజేశారు. పోలీసులు వెంటనే స్పందించి ఐఎఫ్‌టియు మండల కార్యదర్శి రాజేష్ మీద భాస్కర్ మీద దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఐఎఫ్‌టియు నేతలను కలపుకుని ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్, జిల్లా కమిటీ సభ్యులు దావీదు, అరుణోదయ సాంస్కృతిక వేదిక జిల్లా నాయకులు ముత్యాలు, ఐఎఫ్‌టియు కమిటీ సభ్యులు నరసప్ప, ఈశ్వరయ్య, కదిరప్ప, రామాంజి, అనిల్, కార్తీక్, పార్థ పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష

తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న సూపర్వైజర్ లావణ్య

అనంతపురం రూరల్, ఆగస్ట్ 05 ప్రభాతవార్త

తల్లిపాలే బిడ్డకు శ్రీరామ రక్ష అని సూపర్వైజర్ లావణ్య తెలిపారు. బుధ వారం మండలంలోని పూలకుంట,చియ్యేడు, మన్నిల పంచాయతీల అంగన్వాడి కేంద్రాలలో సిడిపిఓ ఉమాశంకరమ్మ ఆదేశాల మేరకు సూపర్వైజర్ లావణ్య అంగన్వాడి కార్యకర్తలు తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించి, బాలింతలు గర్భవతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సూపర్వైజర్ లావణ్య మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే మ్రురుపాలు ఇవ్వాలన్నారు.మొదట ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలు ఇచ్చి ఆరు నెలలు నిండిన తర్వాత ఇతర అను బంధ పాలు ఇవ్వచ్చు అన్నారు.తమ అందం,ఛాయతగ్గిపోతుందని చాలామంది తల్లులు బిడ్డలకు తల్లిపాలు ఇవ్వడం మరుస్తున్నారు. దీనివల్ల బిడ్డల అనా రోగ్యానికి గురవుతున్నారన్నారు. తల్లులు సైతం రొమ్ము క్యాన్సర్తో పాటు రక్తపోటు, మధుమేహం వంటిమారినపడతారన్నారు. ఈ కార్యక్రమంలో అంగ న్వాడి కార్యకర్తలు రాజేశ్వరి, భవాని, యామిని, ఆశ వర్కర్లు, గర్భవతులు బాలింతలు, పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ముస్తఫా అరెస్టు అప్రజాస్వామికం

- డిఎస్సీ అక్రమాలపై డైవర్ట్ చేసేందుకే అక్రమ కేసులు
- వైసిపి మైనార్టీ నేతల విమర్శలు

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సైపుల్లా బేగ్

అనంతపురం సిటీ, ఆగస్టు 5 ప్రభాతవార్త

మాజీ ఎమ్మెల్యే మైనార్టీ నేత ముస్తఫా అరెస్టు అప్రజాస్వామికమని, వైసిపి మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైపుల్లా బేగ్ విమర్శించారు. జిల్లా వైసిపి కార్యాలయంలో బుధవారం మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైపుల్లా బేగ్, మాజీ మేయర్ మహ్మద్ వసీంతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సైపుల్లా బేగ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే వైసిపి కార్యకర్త స్థాయి నుంచి ఎమ్మెల్యే, మాజీ మంత్రి స్థాయి వరకు అక్రమ కేసులు బనాయిస్తూ వేదింపులకు గురి చేస్తున్నారని విమర్శించారు. భాగస్వాముల మధ్య వ్యాపార లావాదేవీలలో విబేదాలు వస్తే మాజీ ఎమ్మెల్యే ముస్తఫాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు బనాయించడం, రెడ్ బుక్ రాజ్యాంగం అమలుకు నిదర్శనమని ఆయన ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలకు వస్తున్న ప్రజా స్పందనను చూసి నేతలను కట్టడి చేసేందుకే అక్రమ కేసులు బనాయిస్తున్నారని, కానీ అక్రమ కేసులకు భయపడే పరిస్థితిలో వైసిపి శ్రేణులు లేరన్నారు. మాజీ మేయర్ మహ్మద్ వసీం మాట్లాడుతూ.. రాష్ట్రంలో 25 నెలల కూటమి పాలనలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిని టార్గెట్ చేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. ఎలాంటి నేర చరిత్ర లేని మైనార్టీ నేత మాజీ ఎమ్మెల్యే ముస్తఫాను వ్యాపారానికి, రాజకీయానికి లింకు పెట్టి, ఉగ్రవాది తరహాలో గుజరాత్‌కు వెళ్లి మరీ అరెస్టు చేయడం, కూటమి నేతల దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో డిఎస్సీ నిర్వహణలో జరిగిన అవినీతి అక్రమాలకు బాధ్యత వహిస్తూ మంత్రి నారాలోకేష్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌ను డైవర్ట్ చేసేందుకు వైసిపి నేతల అక్రమ అరెస్టులు చేస్తున్నారని ఆయన మండి పడ్డారు. విలేకర్ల సమావేశంలో మైనార్టీ నేతలు వేముల నదీం, ఇషాక్, మహబూబ్ బాషా, ఏ1 రఫి, ఖాజీ, వేముల నదీమ్, అబ్బాస్, కిషోర్, ఆసిఫ్, మహిళా నేత సమర్థాజ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే అమృతం ఆరోగ్య కవచం

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం.

అనంతపురం రూరల్ ఆగస్టు 05 ప్రభాతవార్త

తల్లిపాలే అమృతం ఆరోగ్య కవచం అని సూపర్వైజర్ నాగరత్న, అంగన్వాడి కార్యకర్తలు బీ బి, లత, శశికళలు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని అ

04ATP13_04ATP13.qxd 05-08-2026 PM 10:54 Page 1

3.5 కోట్ల నిధుల విరపసముద్రం రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

పూజ చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ దృశ్యం

అమరాపురం ఆగస్టు 5 ప్రభాతవార్త

అమరాపురం నుండి కర్ణాటక బార్డర్ వీరపసముద్రం వరకు ప్రభుత్వం మంజూరు చేసిన 3.5 కోట్ల నిధుల ద్వారా రోడ్డు నిర్మాణపు పనులకు మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు బుధవారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భూమి పూజ నిర్వహించి జెసిబి ద్వారా రోడ్డు పనులను ప్రారంభించారు. గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అర్ధాంతరంగా పనులు చేసి ఆగిపోవడంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ద్వారా నిధులను మంజూరు చేసినట్లు, త్వరితగతిన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లుఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీ లు తెలిపారు. అదేవిధంగా అమరాపురం ఇందిరమ్మ కాలనీలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రికలను ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీలు అందజేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ,గుత్తేదారు గుండుమల జయప్ప, ఆర్ అండ్ బి ఈ ఈ రాజగోపాల్, డి ఈ లక్ష్మీనారాయణ, ఏఈలు నరసింహమూర్తి, రామన్న, తహసిల్దార్ హనుమంతు, ఎంపీడీవో రామారావు, ఈవో ఆల్ డి ప్రసాద్, ఆర్ఐ విన్సెంట్ పాల్, మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సింగల్ విండో అధ్యక్షుడు గణేష్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మారుతీ ప్రసాద్, మాజీ కన్వీనర్ శివ రుద్రప్ప, జడ్పిటిసి పి ఆర్ మూర్తి, మండల క్లస్టర్ కన్వీనర్లు నవీన్, కృష్ణమూర్తి, కో కన్వీనర్లు మంజు తారక్, చెన్నప్ప, డైరెక్టర్ దాదా పీర్,మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు విరుపాక్ష, చంద్రశేఖర్ గుప్తా, మాజీ ఎంపీపీ రామిరెడ్డి, మాజీ సర్పంచ్ విశ్వేశ్వర, నాగోనవల్లి మంజునాథ్,యువ నాయకులు కేఎన్ఎం శివకుమార్ యాదవ్, సురేష్ యాదవ్, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి కేఎన్ పల్లి సురేష్, రాష్ట్ర అధ్యక్షుడు పాండురంగప్ప, మద్దనకుంట రఘు, తమ్మరాయప్ప, డీలర్ల సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి ఉపాధ్యక్షుడు స్టూడియో హనుమంతు, టైలర్ రామాంజనేయులు, వివేక్, చెన్న బసప్ప ప్రకాష్, బీసీ సెల్ కార్యదర్శి రామ్మూర్తి, రామకృష్ణ, ఆనంద్, విజయ్, మాజీడీలర్ శ్రీనివాస్, పులికుంట నాగరాజు, పులి కుంట రాజు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షిలో కలెక్టర్ శ్యాంప్రసాద్ విస్తృత పర్యటన

- రెవెన్యూ కార్యాలయం ఆవరణలో ఇంకుడు గుంతకు భూమి పూజ
- పరిశుభ్రత, పక్కా రికార్డులపై తహశీల్దార్‌కు అభినందనలు
- ఓటర్ల జాబితా సవరణ రికార్డులు క్షుణ్ణంగా పరిశీలన

ఇంకుడు గుంతకు భూమి పూజ చేస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్ , రికార్డ్ రూములను పరిశీలిస్తున్న కలెక్టర్

లేపాక్షి, ఆగస్టు 4 ప్రభాతవార్త

లేపాక్షిమండలంలో శ్రీసత్యసాయిజిల్లాకలెక్టర్ శ్యాం ప్రసాద్ బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, పలుఅభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు.

వర్షపు నీటి సంరక్షణకు ఇంకుడు గుంత :

వర్షపునీటిని భూగర్భంలోకి మళ్లించి నిల్వ చేసేందుకు "వీబీజీ రామ్ జీ" పథకంలో భాగంగా తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్మించనున్న ఇంకుడు గుంత పనులకు కలెక్టర్ భూమి పూజ చేశారు. నీటి సంరక్షణలో భాగంగా ప్రతి ప్రభుత్వ కార్యాలయం ఆవరణలో వర్షపు నీటిని రీఛార్జ్ చేసే వ్యవస్థలను బలోపేతం చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

ఆదర్శంగా లేపాక్షి తహశీల్దార్ కార్యాలయం :

లేపాక్షి తహశీల్దార్ కార్యాలయ భవనం, ఆవరణ పరిశుభ్రతతో పాటు రికార్డు రూమ్‌ను నిర్వహిస్తున్న తీరుపై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. మెరుగైన సేవలందిస్తున్న లేపాక్షి తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, రెవెన్యూ సిబ్బందిని అభినందించారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడంతో పాటు, రికార్డుల భద్రతలో లేపాక్షి రెవెన్యూ కార్యాలయం ఇతర కార్యాలయాలకు ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. ఇదే ఉత్సాహంతో పనితీరును కొనసాగించాలని ఆదేశించారు.

ఓటర్ల జాబితా రికార్డుల తనిఖీ :

అనంతరం కార్యాలయ పనితీరుతో పాటు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి బిఎల్ఓ, బిఎల్ఓ సమావేశాల రికార్డులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. మరణించినవారు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వెళ్లినవారు, ఆచూకీ లేని ఓటర్లకు సంబంధించిన ఫైళ్లను తనిఖీ చేశారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో "నో మ్యాపింగ్", ఇతర వ్యత్యాసాలపై జారీ చేసిన నోటీసులు, నివేదికలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి తహశీల్దార్ సౌజన్యలక్ష్మి ఎంపిడిఒ వాసుదేవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సావిత్రి, డిప్యూటీ తహశీల్దార్ కుమారస్వామిరెడ్డి, ఆర్ఐ ప్రమీల, విఆర్ఒలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరవకొండ నియోజకవర్గంలో కొత్తగా 26 పోలింగ్ స్టేషన్లు

- ఎలక్టోరోల్స్ మ్యాపింగ్‌కాని 46,206 మందికి త్వరలో నోటీసులు
- ఈఆర్వో, కేఆర్ఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రామ్‌మోహన్
- సర్ డ్రాఫ్ట్ పబ్లికేషన్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో, కేఆర్ఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రామ్‌మోహన్

ఉరవకొండ, ఆగస్టు 15 ప్రభాతవార్త

ఉరవకొండ నియోజకవర్గంలో ప్రస్తుతం 260 పోలింగ్ స్టేషన్లు ఉండగా కొత్తగా మరో 26 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరిగిందని ఉరవకొండ-149 అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, కేఆర్ఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రామ్‌మోహన్ తెలిపారు. సర్-2026 డ్రాఫ్ట్ పబ్లికేషన్, ఫారమ్ 6,7,8 దరఖాస్తులు, పరిష్కారం విషయమై చర్చించడానికిగాను బుధవారం ఉరవకొండ మండల తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్వో ఎం.రామ్‌మోహన్ మాట్లాడుతూ ఇదివరకు 1,400 ఓటర్ల వరకు ఒక పోలింగ్ కేంద్రం ఉండేదని ఇప్పుడు దాన్ని 1,200 ఓటర్లకు కుదించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని విడపనకల్లు మండలంలో 8, వజ్రకరూరు మండలంలో 2, ఉరవకొండ మండలంలో 5, బెలుగుప్ప మండలంలో 6, కూడేరు మండలంలో 5 పోలింగ్ స్టేషన్లు కొత్తగా ఏర్పాటు అయ్యాయన్నారు. డ్రాఫ్ట్ రోల్, ఏఎస్‌డీ జాబితా జూలై 31వ తేదీన అన్ని పోలింగ్ స్టేషన్లు, గ్రామ పంచాయతీ, ఏఈఆర్వో, ఈఆర్వో కార్యాలయాల్లో ప్రచురించబడిందన్నారు. బీఎల్ఓలవద్ద ఉన్న డ్రాఫ్ట్ రోల్స్‌ను బీఎల్ఓలు పరిశీలించవచ్చన్నారు. జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు క్లెములు, అభ్యంతరాలు ఇవ్వొచ్చన్నారు. ఎలక్టోర్స్ మ్యాపింగ్ కానివారు, పేర్లు తేడాగా ఉన్న వారు నియోజకవర్గంలో 46,206 మంది ఉన్నారని వారికి త్వరలోనే నోటీసులు అందుతాయన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఆధార్ పత్రాలు, 12 రకాల పత్రాలు సమర్పిస్తే బీఎల్ఓల యాప్‌లో అప్‌లోడ్ చేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య 2,03,306కు చేరిందని ఇందులో పురుషులు 1,00,480 మంది, మహిళలు 1,02,801 మంది, ధర్డ్ జండర్లు 25 మంది ఉన్నారని వివరించారు. ఈ సమావేశంలో ఉరవకొండ, వజ్రకరూరు, బెలుగుప్ప తహశీల్దార్లు, ఏఈఆర్వోలు పి.జి.అరుణ, కె.జయశ్రీ, బి.అనీల్‌కుమార్, విడపనకల్లు డిప్యూటీ తహశీల్దార్ కె.చంద్రమోహన్‌రావు, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ వరప్రసాద్, ఎస్ఏ అశ్వర్థనారాయణ, టీడీపీ ప్రతినిధులు నరిశేటి విజయభాస్కర్, మాదినేని రామాంజినేయులు, వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు ఈడిగ ప్రసాద్, పచ్చి రవి, మహానంది, చిరంజీవి, జనసేన పార్టీ ప్రతినిధి చంద్రశేఖర్, బీజేపీ ప్రతినిధి మాదినేని లక్ష్మినారాయణ, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు సోనియా శీనా, అబ్బాస్ రహిమాన్, ఎరిస్వామి, బీఎస్పీ ప్రతినిధి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో మసాజ్ చేయించుకున్న ఘటనలో ఇద్దరు సస్పెండ్..

మొదటిపేజీతరువాయి... రూపారాణి, విద్యార్థినులకు పాఠాలు చెప్పాల్సింది పోయి వారిచేత సొంత పనులను చేయించుకోవడం, తలకు కొబ్బరి నూనె రాయించుకోవడం, ఒళ్ళంతా మసాజ్ చేయించుకోవడం, ఒళ్లు నొక్కించుకోవడం వంటి వ్యక్తిగత పనులు చేయించుకునేవారు. ఈ వ్యవహారం గత కొన్నాళ్ళుగా జరుగుతున్నా బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఎవరికీ అనుమానంరాకుండా జాగ్రత్తలుతీసుకున్నారు.అయితే ఈగుట్టురట్టయింది. సోషల్ మీడియాలో వీడియోలు, ఫోటోలు వైరల్ అయ్యాయి. విద్యార్థినులతో టీచర్ రూపారాణి మసాజ్ చేయించుకుంటున్న దృశ్యాలను పాఠశాలలో ఉన్న కొందరు రహస్యంగా ఫోటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ ఫోటోలు నెట్టింట తీవ్రంగా వైరల్ కావడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ దృశ్యాలను చూసిన విద్యార్థినుల తల్లిదండ్రులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన గురువులే ఇలాంటి పనులకు పాల్పడటంపై మండిపడుతూ, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ వ్యవహారంపై స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారులు, ప్రత్యేక అధికారులబృందంతో ప్రాథమికవిచారణకు ఆదేశించారు.పాఠశాలను సందర్శించిన విచారణాధికారులు స్థానిక విద్యార్థినులు, సిబ్బంది నుంచి సమాచారం సేకరించి విచారణ పూర్తి చేశారు. విచారణలో టీచర్ రూపారాణి విద్యార్థులతో అనైతికంగా మసాజ్‌చేయించుకున్నట్లు ఆధారాలతోసహా రూఢీకావడంతో అధికారులు చర్యలుతీసుకున్నారు. పాఠశాలబాధ్యతలను సక్రమంగానిర్వహించడంలో ప్రిన్సిపల్ రెహనా విఫలమవ్వడంతోపాటు ఈవిషయాన్నిదాచిపెట్టే యత్నం చేశారన్న ఆరోపణలతో ఇద్దరినీవిధులనుంచి తొలగిస్తూఅధికారులు కఠినచర్యలు తీసుకున్నారు. విద్యార్థులపట్ల అసృశ్యదగాప్రవర్తించినా,చదువుకుకాకుండా ఇతర పనులకు ఉపయోగించుకున్నా ఉపేక్షించేది లేదని అధికారులు స్పష్టం చేశారు.

మన భూమి - అది మన హక్కు

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ రాజముద్ర కలిగిన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ.

ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

పట్టాదారు పాస్ పుస్తకాలు రైతులకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సింధూర

ఓబులదేవరచెరువు, ఆగస్టు 5 , ప్రభాతవార్త

రైతుల హక్కులను పరిరక్షిస్తూ, భూ యాజమాన్యానికి మరింత భరోసా కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి అన్నారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో డబురువారిపల్లి, తిప్పేపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి చేతుల మీదుగా 2,237 మంది రైతులకు ప్రభుత్వ రాజముద్రతో పాటు రైతు ఫోటో ముద్రించిన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆనాడు రైతుల పట్టాదారు పాసుపుస్తకాలపై అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఫోటోను ముద్రించి పంపిణీ చేశారని, అయితే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రైతు గౌరవాన్ని కాపాడే విధంగా రైతు ఫోటోతో పాటు ప్రభుత్వ అధికారిక రాజముద్ర కలిగిన పట్టాదారు పాసుపుస్తకాలను అందజేస్తోందని తెలిపారు. "మన భూమి - మన హక్కు" అనే భావనతో రైతులకు వారి భూ హక్కులపై పూర్తి భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పుట్టపర్తి నియోజవర్గ అభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. నియోజవర్గంలో లక్షకోట్లతో పుట్టపర్తిలో 5వ తరం ఫైటర్ జెట్ పరిశ్రమ ఏర్పాటు తో పుట్టపర్తి నియోజవర్గ అభివృద్ధి గేమ్ చెంజర్ గా మారడం ఖాయం అన్నారు. అదే విధంగా ఆమడ గూరు మండలంలో రూ.51వేల కోట్లతో అతి పెద్ద రిలయన్స్ సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ ఏర్పాటు తో ఈ ప్రాంత అభివృద్ధితో పాటు వేలాదిమందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. అతి త్వరలో ఓడి చెరువు కు మరో సోలార్ ప్రాజెక్టు రానున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు మండల తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి,మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జెడ్పీటీసి పిట్టా ఓబుల్ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు తుమ్మల మహబూబ్ బాషా, బోయపల్లి శివారెడ్డి,మండల తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నిజాం, కంచి సురేష్, జీవి ఆదినారాయణ, కూటమి నాయకులు మహిళా నాయకురాలు సుభాషిణి ,డబురువారిపల్లి ,తిప్పేపల్లి పంచాయతీ టీడీపీ కుటుంబ సభ్యులు,రైతులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

నారాయణపురం గ్రామంలో ఇంటింటికీ కూటమి ప్రభుత్వం

గత ప్రభుత్వానికి, కూటమి ప్రభుత్వానికి తేడా గమనించాలన్న ఎమ్మెల్యే

ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న దృశ్యం.

అనంతపురం రూరల్, ఆగస్టు 05 ప్రభాతవార్త

మెగాడీఎస్సీపై ఆరోపణలుచేస్తున్న వైసీపీవద్ద ఆధారాలుఉంటే మాట్లాడాలని లేదంటే సైలెంట్‌గా కూర్చోవాలని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని నారాయణపురం గ్రామంలో ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. భువనేశ్వర్ నగర్‌లో ఆయన కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. నారాయణపురం పంచాయతీలో గతంలో ఎప్పుడూ లేని విధంగా అభివృద్ధిచేస్తున్నామన్నారు. ఈ ప్రాంతంలో ప్రజలకు బ్రిడ్జి, రోడ్లు, డ్రైనేజీల సమస్యలకు పరిష్కారం చూపించామన్నారు. గతప్రభుత్వంలో ఏంచేశారు. కూటమిప్రభుత్వంలో ఏం జరుగుతోందన్నది ప్రజలు గమనించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తిచేశారు.16347ఉపాధ్యాయ పోస్టులను ఎలాంటి వివాదం లేకుండా భర్తీ చేస్తే.. దీనిపై వైసీపీ నాయకులు పూటకో రాద్ధాంతంచేస్తున్నారన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే కాకుండా పోలవరం, అమరావతి వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో గ్రేడ్ 1 పంచాయతీ అభివృద్ధి అధికారి సర్దార్ వలి, 1వ క్లస్టర్ ఇంచార్జ్ డిష్ నాగరాజు, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, సంగా తేజస్విని, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అర్షదుల్లా, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కడియాల కొండన్న, క్లస్టర్‌ఇంచార్జ్‌లు దళావాయి వెంకటనారాయణ, వన్నురప్ప, టిడిపి నాయకులు మారుతి కుమార్ గౌడ్, సున్నం శ్రీనివాసులు, రఘునాథ్, రమేష్, డాక్టర్ హరి ప్రసాద్, సింగవరం వ్యక్తం, నెట్టెం బాలకృష్ణ, అశ్విని, మాధవి, వరాలమ్మ, వెంకటలక్ష్మి, అక్షిత, శోభ, అయేషా నేహా, యశోద టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమిలో ఇంటింటా సంక్షేమ పథకాలు ప్రతి గ్రామంలో అభివృద్ధి.

- వైసిపి ఓర్వలేనితనంతో ఉనికి కోసం పాకులాట - నియోజకవర్గంలో ఎన్నడూ లేనంతగా మంత్రి సవిత సహకారంతో అభివృద్ధి పరుగులు.
- రొద్దం 22వ బూతులో ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గ అబ్జర్వర్ నరసింహారావు తెదేపా నాయకులు.

రొద్దం, ఆగస్టు 5 ప్రభాతవార్త

ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషి అభినందనీయమని నియోజకవర్గ పరిశీలకుడు నరసింహారావు ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమంలో తెలియజేశాడు ఈ సందర్భంగా మండల కేంద్రమైన రొద్దం 22వ బూతులో ఇంటింటా తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు నరసింహారావు సగర ఉప్పర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ తెదేపా నాయకులు పాల్గొని ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో పేద మధ్య తరగతి కుటుంబాలకు చేస్తున్న సంక్షేమ పథకాలు రెండేళ్లలో సాధించిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించి ఇంటింటికి తెలుగుదేశం కరపత్రాలను ఇవ్వడం జరిగింది మండల పరిధిలో బీటీ రోడ్లు సిమెంట్ రోడ్లు కల్వర్టులు బ్రిడ్జిలు కాంపౌండ్వాళ్ళు ప్రభుత్వ ఆసుపత్రి భవనాలు తల్లికి వందనం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు స్త్రీ శక్తి అన్నదాత సుఖీభవ అన్న క్యాంటీన్ల సిఎస్ఆర్ నిధులు బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆదేశాలతో పలు సంక్షేమ కార్యక్రమాలను దిగ్విజయంగా సంక్షేమ అభివృద్ధి పరుగులు పెడుతుందని రాబోవురోజుల్లో మరింత ముందడుగు దిశగా మండలాన్ని మంత్రి సవిత తీసుకెళ్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నరహరి మాధవ నాయుడు రొద్దంనరసింహులు చిన్నపయ్యవెంకటరామిరెడ్డి చంద్రమోళి వీరాంజనేయులు రామచంద్ర యు నరసింహులు చౌదరి ఈ పవన్ కుమార్ అరుణ్ కుమార్ రెడ్డి చిన్నమంతురు పవన్ ఈ శ్రీ హరీష్ సిద్దన్న ఉమాశంకర్ అక్బర్ కే చంద్రశేఖర్ రామకృష్ణ రుద్ర ప్రసాద్ నరసింహమూర్తి ఆదిశేషు నాగ సురేష్ రమేష్ ముత్యాలు తదితరులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆర్వోబీ నిర్మాణంలో అంతులేని నిర్లక్ష్యం

మొదటిపేజీతరువాయి... నివేదికలు అందజేశారు. కానీ వంతెనల నిర్మాణం క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. స్థల సేకరణ అంశాలు స్థానిక అధికారులతో మాట్లాడినప్పటికీ పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో, ఎన్నేళ్లకు పనులు పూర్తయ్యే అవకాశం ఉందో స్పష్టత లేదు.

ప్రతి సారీ ప్రతిపాదనలకే పరిమితం..

అత్యంత రద్దీగా ఉండే రాయలచెరువు-యాడికి మార్గంలోని యాడికి గేటు వద్ద ఆర్వోబీ నిర్మాణానికి మూడు ప్రతిపాదనలు తెరపైకి తీసుకొని వచ్చారు. సుంకులమ్మ గుడి సమీపంలోని క్రేజీ కేఫ్ ముంగిట నుంచి రైల్వే గేటు మీదుగా రెడ్డిఫార్మ్‌కు వెళ్లే దారి వరకు ఒక వంతెన మార్గం, ఆర్ఎస్ కాటా ఎదురుగా ఉన్న రోడ్డు వైపు నుంచి గేటు మీదుగా 'సీ' ఆకారంలో రెడ్డిఫార్మ్‌కు వెళ్లే దారి వరకు రెండో ప్రతిపాదన సిద్ధం చేశారు. అయితే ఈ రెండింటినీ కాదని మూడో ప్రతిపాదనను కూడా అధికారులు తెరమీదికి తెచ్చారు. అదేమంటే సచివాలయాల వద్దకు వెళ్లేదారి మధ్యలో నుంచి హైవే మీదుగా రైతుల పొలాల మీదుగా రెడ్డిఫార్మ్ దారి దాటిన తర్వాత



ఆర్ఓబీకి మొదట సిద్ధం చేసిన రెండు ప్రతిపాదనలు

టీవల తెరపైకి వచ్చిన మరో ప్రతిపాదన

ముగిసేలా మూడోది ప్రతిపాదించారు. అయితే వీటిలో ఏ ఒక్కటి అమలు పరచకుండా అధికారులు అలసత్వం ప్రదర్శిస్తుండటం విమర్శలకు దారి తీస్తోంది. వాహనచోదకులు, ప్రయాణికులను దృష్టిలో ఉంచుకొని రైల్వేశాఖ వంతెనల నిర్మాణాన్ని త్వరితగతిన ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వినాయక ఉత్సవాల నిర్వహణకు సహకరించండి

- జెసి, అదనపు ఎస్.పి. సూచన - II రోజులకు నిమజ్జనం చేస్తామన్న ఉత్సవ కమిటీ

హిందూపురం , ఆగస్టు 5 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ లోనే వినాయక ఉత్సవాల నిర్వహణకు ప్రసిద్ధి చెందిన హిందూపురంలో ఈ ఏడాది కూడా ప్రశాంతంగా వేడుకల నిర్వహణకు ఉత్సవ కమిటీ వారు అధికారులకు సహకరించాలని జాయింట్ కలెక్టర్ భరద్వాజ్, జిల్లా అదనపు ఎస్.పి.అంకిత సురనా కోరారు. స్థానిక గుడ్డం శ్రీ రంగనాథ స్వామి దేవాలయ ప్రాంగణంలోని కళ్యాణమండపంలో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీ మహేష్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. అధికారులు మాట్లాడుతూ గరిడి గణేష్ ఏర్పాటు చేసి 50 ఏళ్ళు అయిన సందర్భంగా ఈసారి 11 రోజులు వేడుకలు నిర్వహిస్తామని కోరినట్లు చెప్పారు. దీనిపై నిర్ణయం కలెక్టర్, జిల్లా ఎస్పీ తీసుకుంటారని, అయితే ఏడు రోజులు మాత్రమే మంటపాల ను నిర్వహిస్తే కమిటీ నిర్వాహకులకు కూడా భారం కాకుండా ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా సెప్టెంబర్ నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున ఎలక్షన్ కమిషన్ నిబంధనలు కఠినంగా ఉంటాయని వాటిని తాము

ప్రసంగిస్తున్న అదనపు ఎస్.పి. అంకిత

హాజరైన కమిటీ ప్రతినిధులు

పాటించాల్సి ఉంటుందన్నారు. ఉదాహరణకు 144, 30 యాక్ట్ అమల్లో ఉంటుందని జనం గుంపులుగా ఉండడం, డీజే లకు, ర్యాలీలకు అనుమతులు ఉండవని సూచనప్రాయంగా చెప్పారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని ఏడు రోజులు మాత్రమే విగ్రహాలను పెడితే ఇబ్బందులు ఉండవని చెప్పారు. వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్షులు వైటి శ్రీనివాసులు మాట్లాడుతూ అందరివాడు అదనపు ఎస్.పి. మహేష్ సహకారంతో విజయవంతంగా వేడుకలు నిర్వహిస్తామని చెప్పారు. అధికారుల సూచనలపై మంటపాల కమిటీలతో మరోసారి తాము సమావేశమై అభిప్రాయం వెల్లడిస్తామని వివరించారు. వివిధ శాఖల అధికారులు అనేక అంశాలపై సూచనలు అందించారు. సమావేశంలో ఆర్టీవో కరుణ సాగర్ రెడ్డి, సిఐలు రాజగోపాల్ నాయుడు, ఆంజనేయులు, జనార్ధన్, కరీం, ఫైర్ ఆఫీసర్, రెవెన్యూ, విద్యుత్, వైద్యశాఖ అధికారులు, టిడిపి అధ్యక్షులు వెంకటేష్, బిజెపి రమేష్ రెడ్డి, కన్వీనర్ ఆదర్శ్, చారుకీర్తి, నిమ్మకాయల రాము మొదలగువారు పాల్గొన్నారు.

గైడ్లు విక్రయించిన టీచర్లపై చర్యలు ఏవి?

ఇప్పటివరకు విచారణ నివేదిక అందజేయని డిప్యూటీ డీఈఓ

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 5 ప్రభాతవార్త

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గైడ్లు, ప్రైవేటు పుస్తకాలను విక్రయించకూడదని ప్రభుత్వ నిబంధన ఉంది. అయితే ఆ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న టీచర్లు విద్యార్థులకు గైడ్లు విక్రయించడంపై అప్పటి ఇన్ ఛార్జ్ డీఈఓ, ప్రస్తుత అనంతపురం డిప్యూటీ డీఈఓ విచారణ చేశారు. విచారణలో కూడా గైడ్లు బయటపడ్డాయి. దీనిపైన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు విమర్శలకు దారితీస్తుంది. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు జిల్లా పరిషత్